సాక్షి
వికారాబాద్

శనివారం ।20। జూలై । 2024



రైతు సేవలో..
రైతులకు మెరుగైన సేవల అందించడంలో సహకార సంఘాలు ముందున్నాయని డీసీసీబీ చైర్మన్ సత్తయ్య అన్నారు. 8లో▸



అక్రమ మైనింగ్‌పై కొరడా
అక్రమ మైనింగ్‌పై ఆ శాఖ అధికారులు కన్నెర్ర జేశారు. మైన్స్ ఏడీ, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించారు. 9లో▸



విద్యార్థుల ఉన్నతికి కృషి
చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని పెద్దేముల్ మండలం రుక్మాపూర్ మాజీ సర్పంచ్ శివలీల అన్నారు. 9లో▸

22న కొడంగల్ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

కొడంగల్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ : కొడంగల్
కమిషనర్ : బలరాం నాయక్
తేదీ : 22-7-2024 (సోమవారం)
సమయం : మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :
74165 95493, 83099 57839

న్యూస్‌రీల్

అటవీ భూముల్లో వ్యవసాయం చేయొద్దు
ఫారెస్ట్ రేంజ్ అధికారులు సాయిలు, ప్రవీణ్



కుస్మసముద్రంలో అటవీ భూములను పరిశీలిస్తున్న అధికారులు

కుల్కచర్ల: అటవీ శాఖకు చెందిన భూములను ఆక్రమించి వ్యవసాయం చేస్తే చర్యలు తప్పవని ఫారెస్ట్ రేంజ్ అధికారులు సాయిలు, ప్రవీణ్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అనంతసాగర్, కుస్మసముద్రం, మక్తవెంకటాపూర్ గ్రామాల పరిధిలోని అటవీ భూముల్లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న గ్రామాల రైతులు వారి పొలాల్లో మాత్రమే వ్యవసాయం చేసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంత భూముల్లో సేద్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

కొడంగల్ రూరల్: మండలంలోని రావులపల్లిలో జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ ఎం వెంకటేశం ఆధ్వర్యంలో అధికారులు రావులపల్లిలో దాడులు నిర్వహించారు. శరణప్ప కిరాణా దుకాణంలో దాచిన రూ.1,30,125 విలువ చేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ వెంకటేశం తెలిపారు.

డిజిటల్ తరగతులు సక్రమంగా నిర్వహించాలి
రంగారెడ్డి డీఈఓ సుశీందర్‌రావు



పెద్దమంగళారం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, తరగతిగదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల్లో చదివే అన్ని తరగతుల విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాలన్నారు.

నేవీ రాడార్ స్టేషన్‌కు గ్రీన్ సిగ్నల్

నెలాఖరున శంకుస్థాపనకు సన్నాహాలు
- సీఎం చేతుల మీదుగా పనులు ప్రారంభించే అవకాశం
- ఐదేళ్ల క్రితమే మెజార్టీ అనుమతులు
- 2,700 ఎకరాల భూమి అప్పగింతకు అంగీకారం
- స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే టీఆర్‌ఆర్



పూడూరు: నేవీ రాడార్ స్టేషన్ కోసం కేటాయించిన భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే టీఆర్‌ఆర్, అధికారులు

వికారాబాద్: జిల్లాకే తలమానికం కానున్న జాతీయ ప్రాజెక్టు నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెలాఖరున సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, అధికారుల బృందం ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్న దామగుండం అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. పూడూరు మండలం దామగుండం సమీపంలో ఇండియన్ నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ఏడేళ్ల క్రితమే బీజం పడింది. దేశ రక్షణ నిమిత్తం 'లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్'ను ఏర్పాటు చేయాలని అప్పటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చింది. రిజర్వ్ ఫారెస్టు ఆధీనంలో ఉన్న 2,700 ఎకరాల భూమిని నేవీకి ఇచ్చేందుకు అంగీకరించారు. ఇందుకోసం ఫారెస్టు అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక గ్రామ పంచాయతీతో పలు ఒప్పందాలు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కదలిక లేకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఆ దిశగా అడుగులు పడ్డాయి. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కలెక్టర్ ఇతర అధికారులతో చర్చించారు. ప్రభుత్వం కూడా అంగీకరించడంతో ప్రాజెక్టు ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్న దామగుండం అటవీ ప్రాంతాన్ని సందర్శించారు.

2011లో తొలి అడుగు

దామగుండం సమీపంలో రాడార్ స్టేషన్ ఏర్పాటుకు రూ.1,900 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇందుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో 16 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉండగా, దాదాపు అన్ని అనుమతులు వచ్చాయి. పూడూరు మండలం దామగుండం నుంచి పరిగి సమీపంలో గల మల్లెమానిగూడ గ్రామ శివారు వరకు ఉన్న అటవీ భూమి 2,700 ఎకరాలు అవసరమవుతుందని నేవీ సంస్థ గుర్తించింది. 2011 – 12 సంవత్సరంలో ప్రక్రియ ప్రారంభం కాగా 2014లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ అంచనాకు వచ్చాయి. అప్పట్లో ప్రాజెక్టు ప్రారంభించేందుకు వడివడిగా అడుగులు పడ్డాయి. ఆ సమయంలో ప్రభుత్వం మారడంతో ప్రక్రియ ఆగిపోయింది. ప్రాజెక్టు పూర్తయితే పూడూరు, పరిగి, వికారాబాద్ మండలాలకు చెందిన 10 గ్రామాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు జరిగే అవకాశం ఉంది.

రూ.1,900 కోట్లతో..

ప్రపంచంలోనే ఐదో అధునాతన రాడార్ వ్యవస్థ జిల్లాలో ఏర్పాటు కానుంది. పరిగి నియోజకవర్గం హైదరాబాద్ – బీజాపూర్ రహదారి దామగుండం అటవీ ప్రాంతంలో ప్రాజెక్టును నిర్మించనున్నారు. నగరానికి సరిగ్గా 60 కిలోమీటర్ల దూరంలో ఉండటం తోపాటు సముద్ర మట్టానికి 350కి పైగా మీటర్ల ఎత్తయిన ప్రాంతాన్ని ఇండియన్ నేవీ ఎంచుకుంది. ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన 2,700 ఎకరాల భూమి రిజర్వ్ ఫారెస్టుకు సంబంధించింది కావడం.. అక్కడ పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయం ఉండటం మొదట్లో కాస్త అడ్డంకిగా మారింది. ఎంపిక చేసిన భూమి కోసం నేవీ సంస్థ అటవీ శాఖకు రూ.133 కోట్లు చెల్లించింది. ఈ నిధులతో అక్కడ తొలగించిన మొక్కలకు రెండింతలు మరోచోట పెంచాల్సి ఉంటుంది. 400 ఏళ్ల చరిత్ర గల పురాతన దామగుండ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని యథావిధిగా కొనసాగించడంతోపాటు పూడూరు సమీపంలో రూ.5 కోట్ల వ్యయంలో ఇలాంటి ఆలయాన్నే నిర్మిస్తామని నేవీ అధికారులు గతంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలకు హామీ ఇచ్చారు.

అభివృద్ధికి దోహదం

జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందనుంది. ఏదైనా ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఇలాంటి ప్రాజెక్టులు ఎంతో అవసరం. రాడార్ స్టేషన్ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయి.

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

భూములను పరిశీలించాం

రాడార్ స్టేషన్ ఏర్పాటుకు కేటాయించిన భూములను పరిశీలించాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూముల వివరాలు ఇవ్వాలని వారు అడిగారు. ఆ ప్రాసెస్ ఇప్పటికే పూర్తయ్యింది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో సీఎం చేతుల మీదుగా పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

– ప్రతీక్‌జైన్, కలెక్టర్

శోభాయమానం.. గురుపూర్ణిమ మహోత్సవం



కందుకూరు: గురుపూర్ణిమ మహోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల నుంచి పాదయాత్ర, సైకిల్‌పై యాత్రగా తరలివచ్చిన సాధకులతో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మండల కేంద్రం నుంచి పులిమామిడిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రం వరకు చేపట్టిన రథయాత్ర, పల్లకీ సేవ శోభాయమానంగా సాగింది. రథంపై పరమ పూజ్య సద్గురు స్వామి నిఖిలేశ్వరానంద విగ్రహంతో గురూజీ శోభాయాత్రను ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, భక్తి గీతాలు, నృత్యాల నడుమ సాధకులు పెద్ద ఎత్తున పాల్గొని పల్లకీ సేవ, రథంతో పాటు నిఖిల్ చేతనా కేంద్రం వరకు పాదయాత్ర చేపట్టారు. కందుకూరు, కొత్తగూడ, జైత్వారం, పులిమామిడి గ్రామాల మీదుగా పాద యాత్రసాగింది.



అవిశ్వాసం వీగిపోవడంతో సమావేశం నుంచి బయటకు వచ్చిన బీజేపీ కార్పొరేటర్లు

వీగిన అవిశ్వాసం

- కోరం లేదని ప్రకటించిన ప్రిసైడింగ్ అధికారి
- గట్టెక్కిన మీర్‌పేట డిప్యూటీ మేయర్
- నాడు మేయర్.. నేడు డిప్యూటీ మేయర్ విషయంలో బీఆర్‌ఎస్ ప్లాన్ సక్సెస్

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీ పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. ప్రిసైడింగ్ అధికారి, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. 11.30 గంటలు దాటినా సమావేశానికి కార్పొరేటర్లు హాజరు కాకపోవడంతో 12 గంటలకు సమావేశం నిర్వహిస్తామని ఆర్డీఓ మొదటి నోటీసు జారీ చేశారు. 12.15 గంటలకు ముందుగా కాంగ్రెస్, ఆ తరువాత బీజేపీ కార్పొరేటర్లు సమావేశానికి వచ్చారు. అవిశ్వాసానికి 31 మంది సభ్యుల మద్దతు కావాల్సి ఉండగా, బీజేపీ నుంచి 19, కాంగ్రెస్ నుంచి 7 గురితో కలిపి 26 మంది మాత్రమే హాజరయ్యారు. కోరం లేక అవిశ్వాసం వీగిపోయిందని ప్రిసైడింగ్ అధికారి సూరజ్‌కుమార్ ప్రకటించారు. మళ్లీ అవిశ్వాసం పెట్టడానికి ఆస్కారం లేదని, ఒకేసారి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

నాడు మేయర్.. నేడు డిప్యూటీ మేయర్..

అవిశ్వాసానికి సంబంధించి గతంలో మేయర్, ప్రస్తుతం డిప్యూటీ మేయర్ పదవులు చేజారకుండా బీఆర్‌ఎస్ పార్టీ చాకచక్యంగా వ్యవహరించింది. స్థానికంగా, నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీకి పెద్ద నాయకత్వం, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్ మేయర్, డిప్యూటీ మేయర్‌లను పదవుల నుంచి దించడంలో విఫలమయ్యారని పలువురు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ – బీజేపీ కార్పొరేటర్లు కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టడం, నెగ్గడానికి ఇరు పార్టీలకు చెందిన 32 మంది సభ్యులు ఉన్నప్పటికీ చివరికి బీజేపీ నుంచి ఇద్దరు, కాంగ్రెస్ నుంచి నలుగురు గైర్హాజరవడంతో అవిశ్వాసం నెగ్గలేకపోయారు.



అండగా నిలిచినవారికి కృతజ్ఞతలు

అవిశ్వాసం నెగ్గకుండా అండగా నిలిచిన ఎమ్మెల్యే సబితారెడ్డి, తోటి కార్పొరేటర్లకు డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. తనను పదవిలో నుంచి దించేందుకు ఎవరెన్ని కుయుక్తులు పన్నినా ఎమ్మెల్యే ఆలోచన చతురతతో అన్ని విధాలా అవిశ్వాసం నెగ్గకుండా కృషి చేశారని అన్నారు. తనపై నమ్మకంతో మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, ఇతర కార్పొరేటర్లు మద్దతిచ్చారని, కార్పొరేషన్ అభివృద్ధికి మరింత బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు.

బీఆర్‌ఎస్ బాటలో కాంగ్రెస్

- గత సర్కారు తప్పిదాలనే నేటి ప్రభుత్వం చేస్తోంది
- బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి పట్టిన దరిద్రం పోతుంది
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు: గత ప్రభుత్వం చేసిన తప్పులనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం తాండూరులోని సాయిపూర్ తులసీ గార్డెన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో పౌర సన్మాన సభ నిర్వహించారు. ఎంపీని పార్టీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు గజ మాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దేశ ప్రజలంతా బీజేపీకి మద్దతు పలికారన్నారు. మూడో సారి ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమించడంతోనే రాష్ట్రంలో 8 ఎంపీ స్థానాలు వచ్చాయని అన్నారు. రుణమాఫీ కోసం 40లక్షల మంది రైతులు ఎదురు చూశారని, కానీ 10లక్షల మందికే పథకం అమలు చేయడం సరికాదన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. తనను చేవెళ్ల ఎంపీగా గెలిపించడంలో తాండూరు నియోజకవర్గ ప్రజలు కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో తాండూరు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌కుమార్, రాష్ట్ర నాయకుడు నరేష్ మహరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, కౌన్సిలర్లు లలిత, బాలప్ప, లావణ్య, నాయకులు కృష్ణ, భద్రేశ్వర్, వెంకట్, శాంతుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధరణిపై స్పెషల్ ఫోకస్

- నెల రోజుల్లో 3,500 భూ సమస్యలు పరిష్కారం
- ప్రత్యేక చొరవ చూపుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజావాణిలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ (ఫైల్)

వికారాబాద్: ప్రభుత్వం ధరణి సమస్యలను పరిష్కరించడమే ప్రాధాన్యత అంశంగా తీసుకోవడంతో అధికారులు ఆ దిశగా దృష్టి సారించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ధరణి సమస్యలపై ఫోకస్ పెట్టారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అయితే దరఖాస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. జిల్లాలో ప్రస్తుతం పెండింగ్ దరఖాస్తులు 13,400 వరకు ఉన్నాయి. నెల రోజుల్లో 3,500 దరఖాస్తులను పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. అయితే వీటిలో 50శాతం రిజెక్ట్ అయినవేనని తెలిసింది. ఆర్‌ఎస్‌ఆర్ లాంటి పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేసే అధికారం ఆర్డీఓలు, తహసీల్దార్లకు లేదు. ఇలాంటి దరఖాస్తులే ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

పెండింగ్‌లో 13,400 దరఖాస్తులు

జిల్లాలో భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. దాదాపు 13,400 దరఖాస్తులు పెండింగ్ ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో ప్రధానంగా టీఎం – 33, డాటా, పేర్లు, తదితర మార్పులు, ఆర్‌ఎస్‌ఆర్, డిజిటల్ సైన్ తదితర సమస్యలకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నాయి. ఒక్కో సమస్యకు సంబంధించి అనేక సార్లు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటున్న రైతులు వేలు, లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదు. సంవత్సరాల తరబడి మీ సేవా కేంద్రాలు, తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. కోర్టు ఇంటిమేషన్ కేసులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

తహసీల్దార్ కార్యాలయాల్లో కదలని ఫైళ్లు

ధరణి పెండింగ్ సమస్యల విషయంలో రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలు మొదులకొని కలెక్టరేట్ వరకు దరఖాస్తులు పదే పదే తిరస్కరణకు గురవుతున్నాయి. డబ్బులు ఇస్తే తప్ప తహసీల్దార్ కార్యాలయాల్లో ఫైళ్లు కదలడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ ధరణి సమస్యలపై ప్రత్యేక ఫోకస్ పెట్టడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. సాధారణంగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ కార్యాలయం అధికారులు క్షేత్ర స్థాయి పర్యటించి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు దారులు డబ్బులు ఇవ్వకుంటే రిపోర్టులు సమగ్రంగా ఇవ్వడం లేదని, ఈ కారణంగా కలెక్టరేట్‌లో తిరస్కరణకు గురవుతున్నట్లు రైతులు తెలిపారు. దీంతో తిరిగి మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

రుణమాఫీపై స్పష్టత కరువు

ఆందోళన చెందుతున్న అర్హులు

దౌల్తాబాద్: ప్రభుత్వం విడుదల చేసిన రుణ మాఫీ లబ్ధిదారుల జాబితాలో పేరులేని వారు అయోమయానికి గురవుతున్నారు. ఇదే విషయమై బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే తమకు తెలియదని ప్రకటించిన జాబితా మాత్రమే వచ్చిందని సమాధానం చెప్పుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. రుణమాఫీ విషయంలో తమకు స్పష్టత లేదని.. ఇందుకు సంబంధించి తమకు ఎటువంటి ఆదేశాలు ఇవ్వడం లేదని బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించడంతో లబ్ధిదారులు చేసేదిలేక మిన్నుకుండి పోతున్నారు. లక్షలోపు రుణాలు ఖాతాలలో జమచేస్తామని ప్రకటించిన ప్రభుత్వం జాబితాలో ప్రకటించిన విధానం అందులో పేర్లులేని వారికి కారణాలు మాత్రం చెప్పకపోవడం అధికారులకు సైతం పూర్తి సమాచారం విధివిధానాలు తెలపకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం వెల్లడించిన మొదటి విడత అర్హుల జాబితాలో పేరు లేని వారి కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నారు.

గుట్కాపాకెట్లు సీజ్



పోలీసులు సీజ్ చేసిన గుట్కాప్యాకెట్లు

పెద్దేముల్: నిషేధిత గుట్కాలను తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ గిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గాజీపూర్ గ్రామానికి చెందిన సలాంపాషా కర్ణాటక రాష్ట్రం కుంచారం నుంచి మధ్యాహ్నం ప్యాసింజర్ ఆటోలో తాండూరు వైపు ప్రయాణిస్తున్నాడు. అనుమానంతో పోలీసులు తట్టెపల్లి వద్ద తనిఖీ చేయగా రూ.2,390 విలువైన 1,030 గుట్కా ప్యాకెట్లను గుర్తించారు. వాటిని సీజ్ చేసి పెద్దేముల్ పీఎస్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి గ్రామ శివారులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ శరత్‌కుమార్ తెలిపిన ప్రకారం.. చటాన్‌పల్లి శివారులోని ఓపెన్‌ప్లాట్‌లో ఉన్న ఓ షెడ్‌లో గ్రామస్తులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో వెళ్లి చూడగా సుమారు 50ఏళ్ల వయస్సున్న వ్యక్తి శవం కుళ్లిన స్థితిలో ఉంది. మృతదేహాన్ని షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి సంబంధీకులు ఉంటే షాద్‌నగర్ ఠాణాలో సంప్రదించాలన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పాఠశాల ప్రహరీ నిర్మాణంపై వివరణ ఇవ్వండి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అబ్దుల్లాపూర్‌మెట్ కమ్మగూడ ఎంపీపీఎస్ పాఠశాల ప్రహరీ నిర్మాణంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ ముఖ్య కార్యదర్శితో పాటు తహసీల్దార్, డీఈవో, ఎంఈవోకు నోటీసులు జారీ చేసింది. పంచాయతీ రాజ్ ముఖ్యకార్యదర్శి, పాఠశాల విద్య కమిషనర్ తరపున ప్రభుత్వ న్యాయవాదులు, తుర్కయంజాల్ మున్సిపాలిటీ తరపున స్టాండింగ్ కౌన్సిల్ నోటీసులు అందుకున్నారు. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను న్యాయస్థానం ఆదేశించింది. పాఠశాల స్థలానికి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి భూ ఆక్రమణ నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ అబ్దుల్లాపూర్‌మెట్ కమ్మగూడ ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీ దేశు జూన్ 5న లేఖ రాశారు. 'పాఠశాలకు 175 చదరపు గజాల భూమి ఉంది. దీనికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయి. అయితే పాఠశాల మధ్య నుంచి తమకు రహదారి ఉందని కమ్మగూడకు చెందిన న్యూ సుభాష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆరోపిస్తున్నారు. పాఠశాల స్థలం మధ్య నుంచి కచ్చా రోడ్డును ఏర్పాటు చేశారు. నిత్యం వాహనాలు తిరుగుతుండటంతో పిల్లలకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడాల్సి వస్తోంది. దీనిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఇక మరో మార్గం లేక ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాస్తున్నా' అని పేర్కొన్నారు. ఈ లేఖను హైకోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా విచారణకు స్వీకరించింది. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషన్ విజ్ఞప్తిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

రైతు సేవలో సహకార సంఘాలు

డీసీసీబీ చైర్మన్ సత్తయ్య



భూమి పూజ చేస్తున్న సత్తయ్య తదితరులు

మోమిన్‌పేట: రైతులకు మెరుగైన సేవల అందించడంలో సహకార సంఘాలు ముందున్నాయని డీసీసీబీ చైర్మన్ సత్తయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించ తలపెట్టిన డీసీసీబీ బ్యాంకు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతులకు వాణిజ్య బ్యాంకుల తరహా సేవలు అందిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ సేవలతో పాటుగా రుణాల చెల్లింపులోనూ ముందున్నామన్నారు. స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు సకాలంలో అందిస్తున్నామని చెప్పారు. బ్యాంకు సొంత భవన నిర్మాణానికి రూ.63లక్షలు విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మోమిన్‌పేట బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, డీసీసీబీ బ్యాంక్ డైరెక్టర్ అంజిరెడ్డి, చైర్మన్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సీఈఓ శేఖర్ తదితరులున్నారు.

ప్రైవేట్ హాస్టల్‌లో గంజాయి వ్యాపారం

- దాడులు చేసిన నార్కోటిక్ పోలీసులు
- ఆరుగురు విద్యార్థుల అరెస్ట్

ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ హాస్టల్‌లో గంజాయి సేవిస్తూ.. విక్రయిస్తున్న విద్యార్థితో పాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన శ్రీరాములు సాత్విక్(21) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతూ అక్కడే ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నారు. కరీంనగర్ జిల్లా సిరిసిల్ల మండలం ఇల్లంతకుంటకు చెందిన నవీన్(25) గంజాయి విక్రయిస్తుంటాడు. ఇటీవలే నవీన్ భద్రాచలం నుంచి రెండున్నర కిలోల గంజాయి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నాడు. నవీన్‌తో ఉన్న పాత పరిచయంతో అతని వద్ద సాత్విక్ 500 గ్రాముల గంజాయి కొనుగోలు చేసి హాస్టల్‌కు తీసుకువచ్చాడు. నార్కోటిక్ పోలీసులకు అందిన సమాచారంతో హాస్టల్‌పై దాడిచేసి సాత్విక్‌తో పాటు 500గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారణ చేసిన పోలీసులు.. అదే హాస్టల్‌లో ఉంటున్న జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణం సాయిరాంనగర్ కాలనీకి చెందిన నూకల సంపత్ నాయుడు(20), సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణం వెంకట్‌నగర్ కాలనీకి చెందిన స్వయంపాకుల కార్తీక్(20)ను, మరో హాస్టల్‌లో ఉంటున్న ఖమ్మం జిల్లా ఖానాపూర్ గ్రామానికి చెందిన గద్దల ప్రేమ్‌కుమార్(18)ను అదుపులోకి తీసుకున్నారు. వీరి ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా.. హైదరాబాద్ నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ హాస్టల్‌లో ఉంటూ.. హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్న జగిత్యాల జిల్లా పొలాసకు చెందిన పడాల వంశీ(20), హుస్నాబాద్‌కు చెందిన దుంపేట గణేశ్ (21)ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నవీన్ పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ వెల్లడించారు.

కొబ్బరి కాయల విక్రయానికి వేలం

మోమిన్‌పేట: మండలంలోని ఏన్కతల గ్రామంలో కొలువుదీరిన శనైశ్చర స్వామి ఆలయంలో కొబ్బరి కాయలు విక్రయానికి శుక్రవారం వేలం నిర్వహించినట్లు ఆలయ ఈఓ నరేందర్ తెలిపారు. ఏన్కతల గ్రామానికి చెందిన బోయ శ్రీనివాస్ రూ.2.65 లక్షలకు పాట దక్కించుకున్నట్లు తెలిపారు. జూలై 20 నుంచి జూలై 31, 2025 వరకు ఆలయ ఆవరణలో కొబ్బరి కాయలు విక్రయించుకోవచ్చని తెలిపారు. గత సంవత్సరం కొబ్బరి కాయల విక్రయం వేలం ద్వారా ఆలయానికి రూ. 2లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ సారి రూ.65 వేలు అదనంగా వచ్చినట్లు వివరించారు.

మహిళ బలవన్మరణం

అనంతగిరి: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన వికారాబాద్ మున్సిపల్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. వీణ(35), శివకుమార్ దంపతులకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. భర్త వికారాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నారు. గురువారం రాత్రి పడుకున్న తర్వాత ఉదయం 4.30గంటలకు భర్త లేచి చూడగా కూతురు మాత్రమే ఉంది. భార్య కనపడకపోవడంతో లేచి వెతకుతుండగా ఓ గది తలుపు గడిపెట్టి ఉంది. తలుపులు తెరవకపోవడంతో బద్దలు కొట్టి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని కనిపించింది. దీంతో ఆయన విషయాన్ని కుటుంబీకులకు, పోలీసులకు చెప్పారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. తమ కుమార్తె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని.. ఆమె మృతిపై తమకు ఎలాంటి అనుమానం లేదని మృతిరాలి తల్లి సుగుణమ్మ పోలీసులకు తెలిపింది. కేసు దర్యాప్తులో ఉంది.

భోజనానికి వెళ్తూ.. అనంతలోకాలకు

- గుర్తు తెలియని వాహనం ఢీ..
- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



నజీం(ఫైల్)

పరిగి: అప్పటి వరకు సంతోషంగా గడిపిన మిత్రబృందం స్నేహితుడి మరణంతో విషాదంలో మునిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బొంరాస్‌పేట మండల కేంద్రానికి చెందిన నజీం(28), శంకర్, బుగ్గయ్య, అశోక్ స్నేహితులు సరదాగా మాట్లాడుకుంటూ పరిగిలో భోజనానికి వెళ్దామని నిర్ణయించుకున్నారు. రెండు బైక్‌లపై పక్కపక్కన మాట్లాడుకుంటూ పరిగి వైపు వెళ్తుండగా గడిసింగాపూర్ సమీపంలో పరిగి నుంచి కొడంగల్‌వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌లను ఢీకొట్టింది. రెండు బైక్‌లు కింద పడగా నజీం తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శంకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మరో ఇద్దరు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

పహాడీషరీఫ్: అదనపు కట్నం కోసం భార్యను వేధించి హత్య చేసిన నిందితుడికి న్యాయస్థానం జీవితఖైదు విధించింది. పోలీసులు తెలిపిన ప్రకారం. .పహాడీ షరీఫ్ ఠాణా పరిధిలోని వాదేముస్తఫా బస్తీకి చెందిన ఉపాధ్యాయుడు మహ్మద్ నసీరుద్దీన్ అదనపు కట్నం తీసుకురావాలంటూ 2016లో భార్య సల్మాను హత్య చేశాడు. పెళ్లయిన ఐదు నెలలకే సల్మాను హత్య చేసిన ఘటనపై బంధువు ఫిర్యాదు మేరకు పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదు, రూ.1,000 జరిమానావిధించారు. మహిళలపై వేధింపులకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు హెచ్చరించారు.

కందుకూరు తైబజార్‌కు రూ.4.22లక్షలు

కందుకూరు: ప్రతీ ఆదివారం నిర్వహించే అంగడికి శుక్రవారం వేలం నిర్వహించారు. ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద చౌరస్తాలో నిర్వహించే మార్కెట్‌కు నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన ఎడ్ల కృష్ణ రూ.4,22,542కు సొంత చేసుకున్నారు. ఈ వేలంలో ఎంపీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కథ సుఖాంతం

క్షేమంగా ఇంటికి చేరుకున్న చిన్నారి

- నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు



కాజల్‌సింగ్ (ఫైల్)

కొత్తూరు: ఇంటి ఎదుట ఆడుకుంటూ అపహరణకు గురైన ఎనిమిదేళ్ల చిన్నారి కథ సుఖాంతమయ్యింది. శుక్రవారం ఉదయం ఆ చిన్నారి ఇంటికి క్షేమంగా చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సంజయ్‌సింగ్, సుమిత్ర భార్యాభర్తలు. వీరికి కాజల్‌సింగ్(8) కూతురుతో పాటు ఐదేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. రెండేళ్ల క్రితం జీవనోపాధి కోసం వీరు కొత్తూరుకు వచ్చారు. ఈ క్రమంలో కాజల్‌సింగ్ గురువారం స్నేహితులతో కలిసి ఇంటి ఆవరణలో ఆడుకుంటుంది. ఓ అపరిచిత వ్యక్తి చిన్నారితో మాటలు కలిపి మీ డాడీ పిలుస్తున్నాడంటూ అపహరించుకెళ్లాడు. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ నర్సింహారావు తన సిబ్బందితో అక్కడకు చేరుకుని గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. దానికి తోడు కిడ్నాప్ విషయాలను స్థానికంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. తెల్లవారుజామున శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు సైతం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి గాలింపును వేగవంతం చేయాలని సూచించారు. అప్పటికే ఆయా కాలనీల్లో చిన్నారిని అపహరిస్తున్న వ్యక్తి దృశ్యాలను సీసీ కెమెరాల్లో పోలీసులు గుర్తించారు. వాటిని పరిశీలించగా నిందితుడు బాలికను పాత మున్సిపల్ కార్యాలయం రోడ్డు గుండా పోలీస్‌స్టేషన్ మీదుగా జేపీదర్గా వైపు వెళ్లినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో బాలిక శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో నేరుగా ఇంటికి చేరుకుంది. బాలికను పోలీసులతో పాటు తల్లిదండ్రులు వివరాలు అడగ్గా.. హిందిలో మాట్లాడిన వ్యక్తి మీ నాన్నకు డబ్బులు ఇవ్వాలి. ఆయన మార్కెట్లో ఉన్నాడు. నిన్ను తీసుకురమ్మన్నాడని తెలిపింది. ఇంటికి ఎలా చేరుకున్నావని అడగ్గా.. షాద్‌నగర్ రోడ్డులో ఓ ఆటోను ఆపగా తాను కొత్తూరు వై జంక్షన్‌లో దింపినట్లు తెలిపింది. అక్కడి నుంచి ఇంటికి వెళ్లినట్లు చెప్పింది. చిన్నారి చెప్పిన విషయాల ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. అంతేకాకుండా చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. నిందితుడిని అరెస్ట్ చేసిన తర్వాతనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

ఇద్దరు దొంగలకు రిమాండ్

యాచారం: ఓ మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీకి యత్నించిన ఇద్దరు దొంగలను పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు పంపారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా పీఏ పల్లి మండలం మూనవత్ తండాకు చెందిన మూనవత్ రమేశ్, మేడ్చల్ జిల్లా కీసర మండలం బండ్లగూడ గ్రామానికి చెందిన సిలివేరు కిషోర్ రెండు రోజుల క్రితం మండల పరిధిలోని మొగుళ్లవంపు గ్రామానికి చెందిన చిప్పలపల్లి రజిత మెడలోంచి మూడున్నర తులాల పుస్తెలతాడును చోరీ చేసేందుకు యత్నించారు. మెడలోంచి పుస్తెలతాడును లాక్కునేందుకు ప్రయత్నించగా రజిత కేకలు వేయడంతో చుట్టు పక్కల రైతులు వచ్చి వారిని చితకబాది యాచారం పోలీసులకు అప్పగించారు. ఈ ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గోపాల్ తెలిపారు. అదే విధంగా రమేష్, కిషోర్‌లపై రంగారెడ్డి, మేడ్చల్, నల్గొండ జిల్లాల్లో కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

షాద్‌నగర్: ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ గ్రామంలో వనమహోత్సవం కార్యక్రమానికి గుంతలు తీస్తున్న ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ.. నెలల తరబడి కూలీల బిల్లులు పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే ప్రతీ వారం కూలీ డబ్బులు పంపిణీ చేస్తామన్న ఎమ్మెల్యేలు స్పందించాలన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కూలీలకు పనికి తగిన వేతనం చెల్లించని ఎడల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, అంజయ్య, కూలీలు సునీత, రాములమ్మ, జయమ్మ, అంజయ్య పాల్గొన్నారు.

గజాల్లో విక్రయం.. గుంటల్లో రిజిస్ట్రేషన్

చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న పులిమామిడి గ్రామస్తులు

కందుకూరు: ప్రభుత్వ భూములు కబ్జాలు చేసి ఫాంల్యాండ్ పేరిట వ్యాపారం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పులిమామిడి గ్రామస్తులు శుక్రవారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజుకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. పులిమామిడి రెవెన్యూ పరిధిలోని 76,77,78,79 సర్వే నంబర్లలో పూర్ణచందర్ రెడ్డి అనే వ్యక్తి అనుమతులు లేకుండా ఫాంల్యాండ్ వెంచర్లు చేస్తున్నారన్నారు. సర్వే నంబర్ 77లో 7.13 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విలాసవంతమైన అతిథి గృహాలు, చేపల చెరువు, గౌరెలషెడ్ నిర్మించారన్నారు. గుట్టుపల్లికి వెళ్లే నక్షబాటను సైతం కబ్జా చేశాడని ఆరోపించారు. గజాల్లో విక్రయిస్తూ గుంటల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నాడన్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ స్థలాన్ని.. నక్షబాటను కాపాడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎ.దామోదర్‌గౌడ్, రవీందర్, పాండురంగారెడ్డి, శేఖర్, రమేశ్ ఉన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



జైదుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతగిరి: అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, అంగన్‌వాడీ సెంటర్లను శుక్రవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వికారాబాద్ మండలంలోని గోధుమగూడ, జైదుపల్లి గ్రామాల్లో పాఠశాలల్లో పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఎంపీడీఓ వినయ్ కుమార్, ఎంపీఓ నాగరాజు, ఎంఈఓ బాబుసింగ్, పంచాయతీ కార్యదర్శి స్వాతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులున్నారు.

పాఠశాలలను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



రాంపూర్‌తండాలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

ధారూరు: మండలంలోని అల్లిపూర్, రాంపూర్‌తండా, అవుసుపల్లి, నర్సాపూర్, కొండాపూర్‌కలాన్ గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలలను శుక్రవారం ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి సందర్శించారు. ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనుల పరోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలకు పలు సూచనలు చేశారు. అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయించాలని ఆదేశించారు. వీటితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ నర్సింహులు తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో రియల్టర్ల గలాటా

కేసు నమోదు చేసిన పోలీసులు



దాడి చేసుకుంటున్న వ్యాపారులు

మర్పల్లి: ఓ భూమికి సంబంధించిన వివరాలు తీసుకునేందుకు వచ్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సిరిపురం గ్రామానికి చెందిన సీఎం నర్సింలు, జయరాజ్‌తో పాటు తుమ్మలపల్లికి చెందిన మల్లేశంకు ఓ భూమి విషయంలో వివాదం నడుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు ముగ్గురూ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఆఫీసులోనే దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో టేబుల్‌పై ఉన్న కర్ర తీసుకున్న నర్సింలు.. మల్లేశం తలపై కొట్టడంతో గాయమైంది. ఈ ఘటనతో భయాందోళనకు గురైన సిబ్బంది, అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సురేశ్ అక్కడకు చేరుకుని వారిని స్టేషన్‌కు తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అర్చకులకు కనీస వేతనం ఇవ్వాలి

డీడీఎన్ అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్య శర్మ



డీడీఎన్ అర్చకసంఘం నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యశర్మ

ఆమనగల్లు: అర్చకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని దూప, దీప, నైవేద్య(డీడీఎన్) అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు జంగ సుబ్రహ్మణ్య శర్మ డిమాండ్ చేశారు. పట్టణంలోని అయ్యప్ప కొండపై హరిహరపుత్ర అయ్యప్ప ఆలయ ఆవరణలో శుక్రవారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ అర్చకులకు ప్రతీ నెల కనీస వేతనం రూ.18వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా అర్చకులకు కనీసవేతనం ఇవ్వాలని.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అర్చకుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని, రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల డీడీఎన్ అర్చకుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బావోజీ హేమ్లానాయక్, ఉపాధ్యక్షులుగా తోటపల్లి శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా సక్రునాయక్ , కార్యదర్శిగా నర్సింహాచారి, కార్యవర్గ సభ్యులుగా హలియబావోజీ, శ్రీకాంత్‌శర్మ, కేతావత్ బాల్య, ముఖ్య సలహాదారులుగా చెర్కు శివకుమార్, మంగళస్వామి, జగ్గయ్య, రామశర్మలను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, ప్రధాన కార్యదర్శి రాజేశ్, కార్యదర్శి రామానుజాచార్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బావోజీ హేమ్లానాయక్‌ను ఘనంగా సన్మానించారు.

హామీకి కట్టుబడి రుణమాఫీ

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కేశంపేట: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే రుణమాఫీ చేపట్టిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని సంగెం గ్రామంలో ఎమ్మెల్యే పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మండల పరిధిలోని కొత్తపేట, కేశంపేట గ్రామాల్లో రైతులు నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో ఎమ్మెల్యే పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి పదేళ్ల అధికారం అనుభవించి రైతులను నట్టేట ముంచిందన్నారు. త్వరలోనే హామీలన్నీ అమలు చేసి అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తామన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దండి

మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రాథమిక, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల్లో పని చేస్తున్న పలువురు ఉపాధ్యాయులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు బదిలీ అయిన ఉపాధ్యాయులకు శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు ఎక్కడ విధులు నిర్వహించినా విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలరెడ్డి, మండల నోడల్ అధికారి రాజారత్నం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి, మెదక్‌పల్లి, గట్టుఇప్పలపల్లి గ్రామాల్లో శుక్రవారం రుణమాఫీ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మెదక్‌పల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి ప్రతిభను తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని మౌలిక సదుపాయాలు గమనించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి పాఠశాల అభివృద్ధికి రూ.25లక్షలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రూ.3లక్షల నిధులతో నిర్మించనున్న యూజీడీ పనులకు శంకుస్థాపన చేశారు. గట్టుఇప్పలిపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేంకు కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, సైదుపల్లి వెంకట్‌రెడ్డి, క్రియాశీలక కార్యవర్గ సభ్యుడు రేణురెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, అంజయ్య గుప్తా, యాదగిరి, రేణురెడ్డి, కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు విష్ణుగౌడ్, డేవిడ్, రఘురాములు, ప్రదీప్ రెడ్డి, రాములు, భూపాల్‌రెడ్డి, నరేశ్, అజీం, అశోక్‌గౌడ్, అంబాజీ, అజీజ్, శ్రీశైలం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

గట్టుఇప్పలిపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, గ్రామంలో ప్రభుత్వ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, కల్వకుర్తి నుంచి గ్రామానికి బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతూ కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంఘం కన్వీనర్ అశోక్‌గౌడ్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.